క్లుప్తంగా

విద్యుత్ తీగలు మాయం

చిలకలూరిపేటటౌన్: జగనన్న కాలనీలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలపై ఉన్న తీగలు చోరీకి గురయ్యాయి. మండలంలోని గుదేవారిపాలెం గ్రామం సమీపాన ఉన్న జగనన్న కాలనీలో నివాసితుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలపై ఉన్న తీగలు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుని పోయారు. విషయం తెలుసుకున్న చిలకలూరిపేట విద్యుత్‌శాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 15 కిమీ మేర పొడవైన తీగలు చోరీకి గురైందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

చిలకలూరిపేట: పురుషోత్తమపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని సుగాలికాలనీ, భావనారుషినగర్, పండరీపురంలోని 8,9 లైన్లలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్థలానికి దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో సొంత ఇల్లు, ఇంటి స్థలం లేని నిరుపేదలు వారికి దగ్గర్లోని గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి.నిర్మల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు, ఓటరు ఐడీ, పాస్‌పోర్ట్ ఫోటోలు అందజేయాలని తెలిపారు. గతంలో ప్రభుత్వం నుంచి ఇల్లు కాని, ఇంటి స్థలం కాని పొందని వారు దరఖాస్తుకు అర్హులన్నారు.

కవి కమలారామ్‌కు అవార్డు

వినుకొండ: సాహితీ రంగంలో తను చేసిన సేవలను గుర్తించి శనివారం హైదరాబాదు త్యాగరాయగాన సభలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఎన్టీ రామారావు పురస్కారాన్ని కమలారామ్ శనివారం అందుకున్నారు. పట్టణానికి చెందిన జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, జాషువా సమాఖ్య గౌరవ అధ్యక్షులు, రచయిత అయిన కమలారామ్ కి అందించడం జరిగిందని తెలుగు వెలుగు సాహి తీ వేదిక సంస్థ జాతీయ అధ్యక్షులు రాజకుమార్, జాతీయ కార్యదర్శి నాగరాజు, గంగాశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అవార్డుతో పాటు గోల్డ్ మెడల్, శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగిందని వారు తెలిపారు.

కందులు కొనుగోళ్లు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని రైతుసేవా కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు ప్రారంభం చేసినట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శనివారం తెలిపారు. మార్క్‌ఫెడ్ వారి సారథ్యంలో ప్రభుత్వ మద్దతు ధర రూ.7.500లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కంది సాగు చేసిన రైతులు రైతుసేవా కేంద్రాల్లోపేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

బెల్టు షాపుల్లో తనిఖీలు

వినుకొండ: అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు, అతని వద్ద నుంచి మద్యం సీసాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు తెలిపారు. వినుకొండ రూరల్ మండలం పరిధిలోని అందుగుల కొత్తపాలెంలో మద్యం బెల్టు షాపుల్లో తనిఖీలు నిర్వహించిన, అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న మందటి శ్రీనివాసరావుని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సామూహిక సీమంతాలు

చిలకలూరిపేట: రోటరీక్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ జిల్లా గవర్నర్ ఎస్వీ రాంప్రసాద్ పాల్గొన్నారు.ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లావు సుష్మ, క్లబ్ అధ్యక్షులు బోనం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దోరడ్ల మనోజ్‌కుమార్, సభ్యులు ఆది నారాయణరెడ్డి, మోహన్, నాగేశ్వరరావు, చెంచుపున్నయ్య పాల్గొన్నారు.

కోలాటం ప్రదర్శనపై కొట్లాట

యడ్లపాడు: ఇరువర్గాల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీసిన సంఘటన జగ్గాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జగ్గాపురం చర్చి ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా స్థానికులు కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు. అయితే ప్రదర్శన మధ్యలో ఆపివేయడంతో కొందరు ఎందుకు ఆపారని ప్రశ్నించగా, మళ్లీ ప్రదర్శన చేస్తామంటూ చెప్పడంతో వాగ్వాదం మొదలైంది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు ఆస్పత్రికి తరలించడంతో అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

అధికారంలోకి రావడమే మనందరి లక్ష్యం

- నాయకులకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి సూచన


డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన పాతర్ల చిన్న, గుజ్జర్లపూడి ఆకాష్, బూదాల కల్యాణ్, కార్యకర్తలు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరి లక్ష్యం పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావటమే కావాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా యువజన విభాగ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన 14వ వార్డు నాయకుడు పాతర్ల చిన్ని తన అనుమాయులతో కలిసి పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని దుశ్సాలువ కప్పి పూల దండలు వేసి సత్కరించారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈసందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలోని కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఏమి హామీ ఇచ్చారు. ఇప్పుడేమి చేస్తున్నారనేది ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు.. ఆనాడు సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇవ్వటమే కాకుండా ఇల్లిల్లూ తిరుగుతూ చెప్పిన హామీలు తాము తప్పకుండా అమలు చేస్తామంటూ ష్యూరిటీ బాండ్ పేపర్లను పంపిణీ చేశారన్నారు. ఇప్పుడు కేవలం తల్లికి వందనం అరకొరగా అమలుచేసి మిగతా హామీలు అమలు చేయకుండానే అన్నీ అమలుచేశామని చెప్పుకొని తిరుగుతున్నారన్నారు. ముఖ్యంగా 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్యనున్న ప్రతి మహిళలకు నెలకు రూ.1500లు ఇస్తామన్నారని, ఇప్పుడది పీ-4కు అనుసంధానం చేసి ప్రజలను మాయ చేస్తున్నారన్నారు.

బాగా డబ్బులున్న వ్యక్తులు, సంస్థలు డబ్బులు లేని పేద కుటుంబాలను దత్తత తీసుకొని పోషించాలని ప్రభుత్వం చెబుతుందని, ఇది సాధ్యమయ్యే పనేకాదని పేర్కొన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఎవరికీ పైసా చెల్లించలేదని అన్నారు. ఇటువంటి కూటమి నేతల హామీలపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడది కేవలం జిల్లాకే పరిమితం చేస్తామని చెబుతున్నారన్నారు. అబద్ధపు హామీలతో తమను మోసం చేసి అధికారాన్ని చేజిక్కించుకోవటంపై ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఏడాదికే అసహనం తలెత్తిందని, రాబోయే రోజుల్లో అది మరింతగా వ్యాపిస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రజల పక్షాన నిలబడి వారికి మద్దతుగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్ కుమార్, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి బూదాల కల్యాణ్, వార్డు నాయకులు బండి వెంకటేశ్వర రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి సొమ్మును ఫీల్డ్ అసిస్టెంట్లు రీకవరీ చేయాలి

- జిల్లా ఉపాధి పీడీ సిద్దా లింగమూర్తి
- కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందంటూ పలువురు విమర్శ



శావల్యాపురం: ప్రజావేదిక కార్యక్రమంలో సోషల్ ఆడిట్ టీం విచారణ చేయగా రూ.3 లక్షల 21 వేల రూపాయలు అవినీతి జరిగినట్లు గుర్తించామని, వాటిని ఫీల్డ్ అసిస్టెంట్స్‌ల నుంచి రీకవరీ చేయాలని జిల్లా ఉపాధి పీడీ సిద్దా లింగమూర్తి ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆడిట్‌పై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రూ. కోటి 35 లక్షల నగదు పనులకు సంబంధించి ఉపాధి పథకం ఏపీడీ సారథ్యంలో మళ్లీ పునఃవిచారణ చేస్తామన్నారు.

కొండను త్రవ్వి ..

గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో సోషల్ ఆడిట్ సభ్యులు విచారణ చేసి సేకరించిన అంశాలను నివేదిక రూపంలో ప్రజావేదిక కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధుల సమక్షంలో చదివి వినిపించి వ్యత్యాసాలు ఉన్నవన్నీ గుర్తించి రీకవరీ అధికారులు చేయించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ప్రజావేదికలో సోషల్ ఆడిట్ బృందాలు ఇచ్చిన నివేదికపై కూడా పునఃపరిశీలన చేస్తామని జిల్లా ఉపాధి అధికారి స్వయంగా చెప్పడం విశేషం. ప్రజావేదికలో తేటతెల్లమైన అవినీతిని పట్టించుకోకుండా సోషల్ ఆడిట్ బృందాల పనితీరు తప్పు పట్టే విధంగా ఉందని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి పనుల్లో అవినీతిని వెలికి తీసేందుకే కేంద్రం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సోషల్ ఆడిట్ సభ్యులు చేస్తున్న పనితీరును అధికారులు అడ్డుకుంటున్నారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతిని కప్పిపుచ్చేందుకు ఉన్నతాధికారులు నామమాత్రంగా ప్రజావేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉందని ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇప్పటికైనా జరిగిన అవినీతిని గుర్తించి ప్రజాధనాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు అనుకుంటున్నారు.

ఓరియంటల్ పాఠశాల వజ్రోత్సవం నేడు


అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

- జిల్లాలో ఏకైక ఓరియంటల్ స్కూల్
- ఆరున్నర దశాబ్దాలుగా సంస్కృత విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులు


పండిత వేదాంతం రామకృష్ణమాచార్యులు

నరసరావుపేట ఈస్ట్: పూరిపాకలో పురుడు పోసుకున్న సంస్కృత పాఠశాల ఆరున్నర దశాబ్దాలుగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఉన్నత పాఠశాలగా ఎదిగి ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్ది నేడు వజ్రోత్సవం జరుపుకుంటున్నది. పల్నాడు జిల్లాలో ఏకైక సంస్కృత పాఠశాలగా పట్టణంలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ పాఠశాలను 1961లో వేదాంతం రామకృష్ణమాచార్యులు ఏర్పాటు చేశారు. 1965లో మిడిల్ స్కూల్‌గా ఉన్నతిని పొందింది. 1967లో సంస్కృత కళాశాలను ఏర్పాటు చేసినప్పటికీకాలానుక్రమంలో మనుగడ సాగించలేక మూతపడింది. కానీ, ఓరియంటల్ పాఠశాల మాత్రం దినదిన ప్రవర్ధమానమవుతూ నేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా తన పూర్వ విద్యార్థులచే వజ్రోత్సవం జరుపుకుంటున్నది.

పాఠశాల ప్రస్థానం...

ఎటువంటి వసతులు లేని కాలంలో రాజకీయ దురంధరుడు కాసు వెంగళరెడ్డి ప్రోత్సాహంతో పండిత రామకృష్ణమాచార్యులు ఆయుర్వేద గురుకుల విద్యాపీఠం ద్వారా ఏనుగుల బజారులోని చిన్న పూరిపాకలో పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పాఠశాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇప్పించారు. సంస్కృతాంధ్ర భాషల వైపు విద్యార్థులు మొగ్గు చూపటంతో పాఠశాల అభివృద్ధి కొనసాగింది. నరసరావుపేట జమిందార్ రాజామల్రాజ్ విజయకృష్ణ గుండారావు బహదూర్ సహకారంతో నామమాత్రపు అద్దె చెల్లింపుతో పాఠశాలను పూరిపాక నుంచి రాజాగారి కోట ముఖద్వారంలోని గదులలోకి మార్చారు.

దాదాపు 32 సంవత్సరాల కాలం పాటు కోట ముఖద్వారంలోనే పాఠశాల కొనసాగింది. పాఠశాల, కళాశాలను స్థాపించి ప్రిన్సిపల్, కార్యదర్శిగా పనిచేసిన రామకృష్ణమాచార్యులు ఎందరినో ఆగమశాస్త్ర నిష్ణాతులుగా తీర్చిదిద్ది 1976లో స్వర్గస్తులయ్యారు. కాలక్రమంలో కోట శిథిలావస్థకు చేరడంతో పాఠశాల మనగడ ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల చరిత్ర, ప్రాధాన్యతను గుర్తించిన అప్పటి రాష్ట్ర మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు చొరవ తీసుకొని విద్యుత్ కార్యాలయం సమీపంలోని మున్సిపల్ స్థలాన్ని లీజుకు ఇప్పించటంతో పాటు రాజ్యసభ సభ్యుల ద్వారా రూ.25 లక్షలు ఎంపీ ల్యాడ్స్‌ను కేటాయించటంతో పాఠశాలకు 2007లో నూతన భవనం సమకూరింది. సంస్కృత పాఠశాల అయినప్పటికీ దాదాపు 50 శాతంకు పైగా ముస్లిం బాల బాలికలు ఈ పాఠశాలలో సంస్కృతం అభ్యసిస్తూ మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతున్నారు. పాఠశాల సాధిస్తున్న ఫలితాలను గమనించిన రోటరీ క్లబ్ పాఠశాలకు శానిటరీ బ్లాక్, వాటర్ ప్లాంట్ అందచేయటంతో పాటు విద్యార్థులకు అండగా ఉంటూ వారిని ప్రోత్సహిస్తున్నది. రాష్ట్రంలో ఎన్నో ఓరియంటల్ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థల ధాటికి నిలదొక్కుకోలేక మూతపడ్డాయి.

అయితే రామకృష్ణ ఓరియంటల్ పాఠశాల మాత్రం క్రమశిక్షణతో విలువలకు ప్రాధాన్యతనిస్తూ తన మనుగడను సగర్వంగా చాటుకుంటున్నది. అయితే కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యా య నియామకాలు జరగక పోవటంతో 2022లో అప్పటి పాలకవర్గం పాఠశాలను ప్రభుత్వంలో విలీనం చేసింది. అప్పటి నుంచి పాఠశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా కొనసాగుతున్నది. పూర్వ విద్యార్థుల సహకారంతో 2012లో స్వర్ణోత్సవాలు జరుపుకున్న పాఠశాల నేడు వజ్రోత్సవాలకు సిద్ధమైంది. స్థానిక శ్రీపట్టాభిరామ స్వామి ఆలయంలోని శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపంలో ఈ వేడుకను నిర్వహించనున్నారు. వేడుకలకు దేశ, విదేశాలలోని పూర్వ విద్యార్థులు హాజరు కానున్నారు.

బైకు దొంగిలించబోయి దొరికిపోయాడు!

యడ్లపాడు: బైక్ చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోయపాలెం గ్రామంలో రామాలయం వీధిలో శుక్రవారం అర్ధరాత్రి వీధి కుక్కల అరుపులు ఎక్కువగా ఉండటంలో స్థానికులు లేచి గమనించారు. అప్పటికే ఓ బైక్‌కు తాళం తీస్తూ ఓ వ్యక్తి కనిపించడంతో కేకలు వేశారు. వెంటనే అతను పరారు కావడం గమనించి పరుగున వెళ్లి పట్టుకున్నారు. అతన్ని పట్టుకుని ఆరా తీయగా బైక్ తాళం తీస్తుండగా తాళం విరిగిపోయిందని గ్రహించారు. దీంతో సమాచారం పోలీసులకు తెలిపి అతన్ని అప్పగించినట్లు తెలిపారు. అయితే ఇదే వీధిలో గతంలో రెండు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురినట్లు స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు పోలీసులు విచారణలో తెలియాల్సి ఉంది.

వైద్య సంస్థల సహకారంతో మెరుగైన వైద్యసేవలు



చిలకలూరిపేట: కొన్ని వైద్య సంస్థల సహకారంతో ప్రజలకు కంటి వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇక్కడ నిర్వహించిన వైద్య శిబిరం ద్వారా కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేయటం జరుగుతుందన్నారు. శంకర నేత్ర వైద్యశాల, మణిపాల్, కిమ్స్, సెంటినీ వంటి వైద్య సంస్థలతో కలసి క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీహెచ్‌వోఎస్ డైరెక్టర్ అరవిందకుమార్, శంకర ఆసుపత్రికి చెందిన శ్రీనివాసరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ ముద్దన రమేష్‌బాబు, డాక్టర్ కందిమళ్ల జయమ్మ పాల్గొన్నారు.

ప్రతిభకు బహుమతులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతిలో గత విద్యాసంవత్సరంలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం బహుమతులు అందజేశారు. మొదటి ర్యాంక్ సాధించిన సాహితికి రూ.15 వేల రూపాయలు, రెండవ ర్యాంక్ సాధించిన గంటా ప్రేమ లక్ష్మీ మూరారికి రూ.12 వేల రూపాయలు మూడవ ర్యాంక్ సాధించిన మూకిటి కీర్తనకు రూ.5 వేల రూపాయలు, అలాగే 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మంచి ప్రతిభ కనపరిచిన వారికి రూ.2500లు, 2000ల రూపాయల చొప్పున అందజేశారు.

సుబ్బరాయ శ్రేష్టికి ఘననివాళి



నరసరావుపేట ఈస్ట్: పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి ఏడున్నర దశాబ్దాలకు పూర్వమే తన సొంత నిధులతో వాటిని అందించిన నాగసరపు సుబ్బరాయశ్రేష్టి చిరస్మరణీయుడని పలువురు కొనియాడారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో శనివారం కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి సుబ్బరాయ శ్రేష్టి 68వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభలో కళాశాల పూర్వ విద్యార్థి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బారాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొని సుబ్బరాయ శ్రేష్టి దాతృత్వాన్ని కొనియాడారు. మానవతావాదిగా ఆయన చేపట్టిన కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు.

నిరుద్యోగ భృతిపై రేపు నిరసన

చిలకలూరిపేట: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నాయకులతో కలసి విలేకర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.


కేర్ కార్యక్రమంపై అవగాహన

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన కేర్ కార్యక్రమంలో భాగంగా వినుకొండప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ సిబ్బంది కలసి వినుకొండ టౌన్‌లోని కృష్ణవేణి జూనియర్ కాలేజీలో విద్యార్థులతో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేకంగా విద్యార్థులనుద్దేశించి ఉపన్యసించారు. ఎక్సైజ్ సీఐ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎస్.ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, వినుకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ మాస సారె

రొంపిచర్ల: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సారె సమర్పించారు. అమ్మవారికి ఇష్టమైన పూలు, గాజులు, చలివిడి, గోరింటాకు, పట్టు వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరావు తో పాటు పలువురు ఆర్యవైశ్య సంఘం పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నూజెండ్ల మండల పార్టీ కమిటీ ఇదే



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని నూజెండ్ల మండల పార్టీ కమి టీని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యా లయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు....

నూజెండ్ల మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా ముప్పరాజు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా మారెళ్ల క్రిష్టారెడ్డి, వంగూరి ప్రసాదు, ప్రధాన కార్యదర్శులుగా గోగులపాటి పున్నయ్య, సింగశెట్టి రామచంద్రరావు, లేళ్ల అంజిరెడ్డి, గొట్టం వెంకటరెడ్డి, కార్యదర్శులుగా కొత్తా వీరాంజనేయరెడ్డి, మల్లంపాటి అంజిరెడ్డి, ఆవుల వెంకటేశ్వర రెడ్డి, యంపరాల అప్పారావు, పాడిగటి వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, మానిక చెన్నారావు, కొమ్మినేని శ్రీనివాసరావు, ముసిరిక సుబ్బారెడ్డి, ధర్మవరపు ఆంజనేయులు, నర్రపోలు రాజు, సిలం కొండలు, చామంతి సుబ్బారావు, రథం నరసింహులు, సతారు రమణారెడ్డి, బట్టు గురునాథం, తెల్లమేకల బాలకృష్ణ, గంజిబోయిన వీరాంజనేయులు, సోముల వెంకటేశ్వర రెడ్డి, దాసరి జాను, మేకల వెంకటేశ్వర్లు, కొత్తా వెంకటేశ్వర్లు రెడ్డి, కందుల రాంబాబు నియమితులయ్యారు.

మితిమీరిన కూటమి నేతల ఆగడాలు

80 ఏళ్ల వృద్ధురాలి స్థలాన్ని ఆక్రమించి రోడ్డు వేసేందుకు యత్నం


వృద్ధురాలి స్థలాన్ని ఆక్రమించి వేస్తున్న రోడ్డు

నాదెండ్ల: కనపర్రు గ్రామంలో కూటమి నేతల ఆగడాలు పెచ్చురిల్లుతున్నాయి. గతంలో పచ్చవ కోటేశ్వరరావు స్థలంలో అక్రమంగా రోడ్డు వేశారు. తాజాగా ఎనభై ఏళ్ల వృద్ధురాలైన పచ్చవ వెంకట సుబ్బాయమ్మ స్థలంలో రోడ్డు వేసేందుకు ఉపక్రమించారు. వివరాల్లోకి వెళితే.. పచ్చవ వెంకట సుబ్బాయమ్మకు ముగ్గురు కుమారులు. అంజయ్య అనే కుమారుడు ఇరవై ఏళ్ల క్రితం మృతి చెందగా, అతని వాటాలో 15 సెంట్ల స్థలం వెంకట సుబ్బాయమ్మకు సంక్రమించింది. ఈ స్థలానికి పక్కనే ఆరు మూరలు వెడల్పు గల రోడ్డు ఉంది. తాజాగా రోడ్డుకు మరో నాలుగు మూరలు, కాలువలకు రెండు మూరలు వెడల్పున ఆక్రమించి రోడ్డు వేస్తున్నారు. తన స్థలంలో రోడ్డు వేయవద్దని ఆమె కూటమి నాయకులకు చెప్పినా, వారు పట్టించుకోలేదు. తన మూడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి రోడ్డు వేస్తున్న కూటమి నేతలపై అధికారులు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని వృద్ధురాలు వెంకట సుబ్బాయమ్మ వాపోతోంది. తన స్థలం తనకు అప్పగించాలని, లేదంటే స్థలం విలువ ఆధారంగా నష్టపరిహారమైనా చెల్లించాలని కోరుతోంది.

ఎంఏఎం కళాశాలలో స్నాతకోత్సవం


స్నాతకోత్సవంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

నరసరావుపేట రూరల్: ఫార్మసీ అనేది వృత్తి మాత్రమే కాదని ఒక సేవా రంగం అని ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. కళాశాలలో శనివారం స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ రామశేషగిరిరావు, ప్రముఖ మనస్తత్వవేత్త డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, రిటైర్డ్ ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ కోయ రామారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ మందుల తయారీ, వాటి ప్రభావం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం వంటి బాధ్యతలు ఫార్మసీ విద్యను పూర్తిచేసి కొత్తదశలోకి అడుగుపెడుతున్న విద్యార్థులపై ఉందని తెలిపారు. ఫార్మసీ రంగంలోకి ప్రవేశిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సేవ చేయబోతున్నారని తెలిపారు. పరిశ్రమలోకి వెళ్లినా, క్లినికల్ ఫార్మసీలోకి పనిచేసినా, అధ్యాపక రంగంలోకి ప్రవేశించినా నిజాయితీ, కర్తవ్యనిష్ఠతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో మరింత అభివృద్ధి

యడ్లపాడు: మరో నాలుగేళ్లలో కొండవీడు కోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగారావుపాలెం, కోట, సంతపేట, చెంగిజ్ ఖాన్‌పేట గ్రామాల్లో పర్యటించారు.

దరఖాస్తులు ఆహ్వానం

చిలకలూరిపేటటౌన్: సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఖాళీ సీట్ల భర్తీ స్పాట్ ప్రాతిపదికన చేయనున్నట్లు హాస్టల్ వార్డెన్ కె రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మురికిపూడిలోని గురుకుల బాలుర వసతి గృహంలో 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు 25 సీట్లు ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. వివరాలకు సెల్‌నంబర్: 74165 16599కు సంప్రదించాలన్నారు.

పూల మొక్కలు పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా చేపట్టాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త తెలిపారు. శ్రీకల్పవల్లి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శ్రీవేంకటేశ్వర కళ్యాణ మండపంలో ఉచితంగా పూల మొక్కలు, కుండీలు పంపిణీ నిర్వహించారు.